పెద్దగెడ్డ స్పిల్‌వే పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ జలాశయం స్పిల్‌వేను ఎస్ఇ కె.సూర్య కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత నీటిమట్టం గేట్లు సక్రమంగా పనిచేస్తున్నయా లేదా అని డిఇ కనకారావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరిత రహదారి పెద్దగెడ్డ కాలువలపై క్రాస్ అయ్యే ప్రదేశాలను పరిశీలించారు. శాఖా పరంగా అప్రూవల్ ఇవ్వడానికి క్రాస్ అయ్యే ప్రదేశాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఇఇ ఆర్.అప్పలనాయుడు ఉన్నారు.



స్పిల్‌వేను పరిశీలిస్తున్న ఎస్ఇ సూర్యకుమార్

ఊపందుకున్న ఉబాలు

- అధిక విస్తీర్ణంలో ఎదసాగు
- ఖరీఫ్ సాగుపై పెరుగుతున్న ఆశలు
- పూడికతీతలకు నోచని కాలువలు

ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు

ప్రతికూల వాతావరణం కారణంగా వర్షాలు అనుకూలించకపోవడంతో గత ఏడాదితో పోలిస్తే ఈఏడాది ఖరీఫ్ సీజన్ జిల్లాలో ఆలస్యంగా ప్రారంభమైంది. సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదైనా, గత కొద్దిరోజులుగా జిల్లా అంతటా కురుస్తున్న వర్షాలకు రైతుల్లో ఖరీఫ్ సాగుపట్ల ఆశలు చిగురించాయి. చెరువుల్లో నీరు చేయడంతో రైతులు సాగుకు సన్నద్ధమవ్వడంతో ఉబాలు ఊపందుకున్నాయి. వర్షాలు ఆలస్యం కావడంతో ఎప్పుడూలేనంతగా ఈ ఏడాది రైతులు ఎక్కువ శాతం ఎదలు జల్లుకున్నారు. వరినారు అందుకురావడంతో పొలాల్లో ముమ్మరంగా దుక్కులు సాగించి నాట్లు వేసుకునేందుకు జిల్లాలోని దాదాపు అన్ని మండలాల రైతులు సిద్ధం కావడంతో ఉభాలు ఊపందుకున్నాయి.

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో 15మండలాల్లో మొత్తం ఖరీఫ్ విస్తీర్ణం లక్షా80వేల ఎకరాలు కాగా, అందులో వీరఘట్టం మండలంలో 17700 ఎకరాలతో వరిపండించే మండలాల్లో జిల్లాలో అగ్రస్థానంలో ఉంది. 3835 ఎకరాల్లో పాచిపెంట మండలం ఆఖరున నిలచింది. ఇప్పటికే తోటపల్లి కుడి, ఎడమకాలువల ద్వారా సాగు నీరు విడుదల చేయగా, జంఘావతి దిగువకాలువ నీటిని కూడా విడుదల చేశారు. అలాగే వట్టిగెడ్డ రిజర్వాయర్, పెదంకలాం రిజర్వాయర్ల నుండి నీరు విడుదలకు సన్నాహకాలు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది నీటిపారుదలశాఖకు నిధులు విడుదల సకాలంలో మంజూరు చేయకపోవడంతో పలు రిజర్వాయర్‌లకు సంబంధించిన కాలువల్లో పూడికలు పెద్ద సమస్యగా మారాయి. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికలు తొలగించకుండా జంఝావతి కుడికాలువ నీరు విడుదల చేశారు. అయితే పూడికలు విపరీతంగా పేరుకుపోవడంతో కొమరాడ, పార్వతీపురం, సీతానగరం, గరుగుబిల్లి మండలాలకు చెందిన 12వేల ఎకరాల ఆయకట్ట రైతులకు సాగునీరు ఇంత వరకూ అందకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే సీతానగరం, బలిజిపేట మండలాలకు సంబంధించి 8వేల ఎకరాల ఆయకట్టకు ఆధారమైన పెదంకలాం కాలువలో ఎక్కడికక్కడ గండ్లు, పూడికలు పడడంతో అనుకున్నంతా నీరు చేరక కర్షకలు ప్రయాస పడుతున్నారు. ఆయా రిజర్వాయర్లకు సంబంధించిన అధికారుల స్పందించి పనులు వెంటనే ప్రారంభించి పూడికలు తొలగించకపోతే నీరు విడుదల చేసినప్పటికీ ప్రయోజనం ఉండదని వాపోతున్నారు.

గత ఐదురోజులుగా జిల్లాలో వర్షపాతం

జిల్లాలో గల ఐదురోజులుగా నమోదైన వర్షపాతం ఇలా ఉంది. ఈనెల 22న 177 మిల్లీమీటర్లు కాగా, 23న 112మి.మీ., 24న 176.8మి.మీ, 25న 472మిమీ, 26న 115.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అయితే ఇది సాధారణ వర్షపాతం కన్నా తక్కువ అయినప్పటికీ రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవరణ శాఖ ప్రకటించడంతో మరిన్ని వర్షాలు కురిసి చెరువులు నిండుతాయని అధికారులతో పాటు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుర్రపుడెక్కలతో నిండిపోయిన జంఝావతి కుడికాలువ

నిండుకుండను తలపిస్తున్న వెంకటమ్మసాగర్

చెరువులకు జల కళ

వీరఘట్టం : మండలంలోని వెంకమ్మసాగరం, రాజ, సీతమ్మధార, నారాయణ, చెల్లమ్మ తదితర చెరువులు నీళ్లతో కళకళాలాడుతున్నాయి. కురుస్తున్న వర్షాలతో పాటు కాలువ ద్వారా సాగునీరు రావడంతో ఒక్కసారిగా చెరువులో నీటిమట్టం అమాంతంగా పెరిగిపోయింది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అన్నదాతలు పొలం పనులు బిజీగా ఉన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సమితి రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ

మోడీ దుష్పరిపాలన నుంచి రైతులను కాపాడాలి

- 30న విజయవాడలో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి
- రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్రనాయకులు మర్రాపు

ప్రజాశక్తి- కలెక్టరేట్

మోడీ దుష్పరిపాలన నుంచి రైతులను, శ్రామికులను కాపాడుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. రైతులకు నష్టం కలిగించే 3 వ్యవసాయ చట్టాల రద్దుకు మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న విజయవాడలో జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో జిల్లా సదస్సు బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జరిగింది. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, ఆర్‌సిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి.శ్రీను నాయుడు, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి పి.రమణి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇవి నాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యనారాయణ మాట్లాడుతూ భారత వ్యవసాయ రైతంగానికి తీవ్రమైన హాని కలిగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను, విద్యుత్ సంస్కరణ బిల్లు 2020ను రద్దు చేయాలని అన్నారు. పంటలన్నింటికీ డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా సమగ్ర పంట ఉత్పత్తికి 50 శాతం కలిపి చట్టబద్ధ ఎంఎస్‌పి నిర్ణయించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 500 పైగా రైతు సంఘాలతో ఏర్పడ్డ సంయుక్త కిసాన్ మోర్చా నేతృత్వంలో సంవత్సరం పైగా పోరాటం కొనసాగించినా లెక్క చేయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ఉత్తర ప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు క్షమాపణ చెప్పి రైతుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తానని రైతులతో చర్చించిన తర్వాతే పార్లమెంట్లో ప్రవేశపెడతామని లిఖితపూర్వక హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలు చేయలేదని అన్నారు. ఈనేపథ్యంలో రెండో దశ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అందులో భాగంగా ఈనెల 30న విజయవాడలో పిబి సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో కర్షకుకార్మిక రాష్ట్ర సదస్సు జరుగుతుందని, ఈ సదస్సులో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రైతులు ,కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. సదస్సులో దంతల్లూరి వర్మ, బుడితి అప్పలనాయుడు, బొత్స నరసింగరావు, పి.భాస్కరరావు తదితరులు ప్రస్తుత కాలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయం ప్రస్తుత పరిణామాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సుంకి గ్రామ సర్పంచ్ రవీంద్ర, వెలమల సత్యనారాయణ, ఎం. భాస్కరరావు, ఎస్.విశ్వేశ్వరరావు, ముత్యాలు, పి.సంగం వావిలపల్లి రమణమూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్‌గా బంటు దాసు

సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీని సదస్సులో ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ గా బంటు దాసు, సమ న్వయ సమితి సభ్యులుగా డి.వర్మ, బుడితి అప్పలనాయుడు, బొత్స నర్సింగ రావు, కృష్ణ, వివిధ సంఘా లకు చెందిన నాయ కులు ఎన్నికయ్యారు.

చదువుకు పిల్లలు దూరం కాకూడదు : కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొండ

బడి ఈడు పిల్లలు ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. పాలకొండ పట్టణం పెద్ద కాపు వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించే ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు బడి ఈడు పిల్లలను పాఠశాలలో ఎంత మందికి చేర్పించింది, డ్రాప్ అవుట్స్ ఎంతమంది ఉన్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాలకొండ పరిధిలో సుమారు 176 మంది బడికి బయట ఉన్న పిల్లలను ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించి పాఠశాలలో చేర్పించడం జరిగిందని తెలిపారు. ఇందులో ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిన వారు ఉన్నారని, అటువంటి వారిని గుర్తించి బడిలో చేరేలా చర్యలు తీసుకున్నామని ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక అధికారి అర్.విజయకుమారి కలెక్టర్‌కు వివరించారు. బడిలో డ్రాప్ అవుట్స్, వలసలతో దూరమైనందుకు గల కారణాలను, పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు బడి ఈడు పిల్లలు బడికి చదువుకు దూరం కాకూడదన్న ఉన్నతమైన ఆశయంతో ప్రభుత్వం అమ్మఒడి వంటి పథకాలను అమలు చేస్తూ పిల్లలు ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు బాధ్యత వహిస్తుందన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను సమర్ధవంతంగా నిర్వహించి బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క బడి ఈడు పిల్లడు తప్పకుండా వారం రోజుల్లోగా శత శాతం నమోదయ్యేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. పిల్లల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు బృంద చర్చలు, పాఠ్యాంశాల పై పట్టుసాధించేదుకు బహిరంగంగా వెలువరించే అవకాశం కల్పించాలని, తద్వారా లోపాలను సరిదిద్ద వచ్చని అన్నారు. అనంతరం నాడు నేడు రెండో విడత కింద మంజూరైన పాఠశాల అదనపు తరగతుల భవన నిర్మాణాలను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పనుల పురోగతిని పరిశీలించి అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఇఇ ఎన్.ప్రేమకుమార్, ఎంఇఒలు పి.కృష్ణమూర్తి, సిహెచ్.సోంబాబు, ఉపతహశీల్దార్ వి.బుచ్చయ్య, ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.సోమేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఖచ్చితమైన ఓటరు జాబితాకు సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటరు పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ అర్.గోవిందరావు కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు పునశ్చరణ కోసం క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి బిఎల్‌ఒలు సర్వే చేస్తున్నారని తెలిపారు. ఓటరు జాబితా తయారీలో తప్పులు జరగకుండా లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పారదర్శకంగా, ఖచ్చితమైన జాబితా రూపొందించేందుకు పూర్తి సహకరించాలని కోరారు. నిబంధనలకు లోబడి ఓటరు తొలగింపు అంశానికి సంబంధించి ప్రతి ఓటును క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని, దీనికి ఓటర్ నమోదు అధికారులు పూర్తి భాద్యత తీసుకోవాలని తెలిపారు. ఓటును తొలగించేందుకు ఫారమ్ 7 గురించి వారం రోజుల ముందు గా తొలగించేందుకు గల కారణాలను వివరించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇంజినీరింగ్ పనులు పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం చేపడుతున్న పనులపై స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో బుధవారం పిఒ సమీక్షించారు. వర్షాలు ప్రారంభమయ్యాయని, చివరి దశలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్రాధాన్యతా భవనాలు, పాఠశాలల భవనాలు ఉంటే వేగంగా అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ గోడలు, కిటికీలు, తలుపులు తదితర వసతులను పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె. శాంతీశ్వర రావు, డీ. ఇ తిరుపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ దగ్గర మళ్లీ వివాదం

ఎమ్మెల్సీకి, స్థానికులకు వాగ్వివాదం నిలిచిపోయిన పనులు

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక నగర పంచాయతీకి సంబంధించి మండలంలో టిడిపారాపురంలోని ఐదెకరాల స్థలం కేటాయించగా గతంలో రెండుసార్లు ఆ పనులు చేయడానికి వెళ్లిన అధికారులను ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. తాజాగా బుధవారం మరోసారి వివాదం చోటుచేసుకుంది. డంపింగ్ యార్డ్‌కు కేటాయించిన స్థలంలో పనులు ప్రారంభించడానికి నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సిద్ధమయ్యారు. సిఐ మురళీధర్, ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తుతో పనులు చేపడుతుండగా గ్రామస్తులు డంపింగ్ యార్డ్ చేపట్టడానికి వీలులేదని, కోర్టు స్టే ఉందని చెప్పారు. దీంతో అక్కడకు చేరుకున్న ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ నగర పంచాయతీకి గతంలో కలెక్టర్ డంపింగ్ యార్డ్ కోసం ఇక్కడ స్థలం కేటాయించారని, కచ్చితంగా పనులు చేపట్టి తీరుతామని చెప్పగా గ్రామస్తుల తరుపున టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు అడ్డుకున్నారు. ఇదే సర్వే నెంబర్‌లో 8 ఎకరాల స్థలాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వైద్యశాల నిర్మించేందుకు గతంలో అప్పటి కలెక్టర్ ధనుంజయరెడ్డి మంజూరు చేశారని, ఈ ప్రాంతవాసులకు ఇదే ఆధారమని, ఇక్కడ డంపింగ్ యార్డ్ చేపట్టి ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ కొండనీరే తమ వ్యవసాయానికి ఆధారమని, వేరేచోట నిర్మించుకోవాలని చెప్పగా పిచ్చుకమీద బ్రహ్మాస్త్రాలు వేయడం తనకు ఇష్టం లేదని, డంపింగ్‌యార్డ్ నిర్మాణానికి సహకరించాలని ఎంఎల్‌సి అనడంతో గ్రామస్తులు నిలదీశారు. అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కోర్టులో ఉన్న విషయంపై అవగాహన లేకుండా రావడమే తప్పని కర్నేన అప్పలనాయుడు నిలదీశారు. గ్రామస్తుల బాధలు మీకు పట్టవని, ప్రజలు ఓట్లుతో గెలిస్తే ఆ బాధలు తెలుస్తాయని టిడిపి మహిళా నేత కర్నేన యోగిత అనగా ఎంఎల్‌సి విరుచుకుపడ్డారు. ఇంటికి వెళ్లి వంట చేసుకోవాలి తప్ప రాజకీయాలు చేయడమేమిటని ఆమెను ప్రశ్నించారు. మీ ఇంట్లో మీ అమ్మకు, మీ భార్యకు మరెందుకు పదవులు ఇచ్చారని ఎంఎల్‌సిని ప్రశ్నించారు. దీంతో కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు సముదాయించారు. దీంతో పనులు నిలిచిపోయాయి.

ఎమ్మెల్సీతో వాగ్వివాదం చేస్తున్న టిడిపారాపురం గ్రామస్తులు

విజయవాడలో సీఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయవాడలో సీ ఫుడ్ ఫెస్టివల్ జులై 28, 29, 30 తేదీల్లో ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య తెలిపారు. ఈ మేరకు ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్ ను జిల్లా మత్స్యశాఖ అధికారి బుధవారం మత్స్య శాఖ కార్యాలయంలో విడుదల చేశారు. సీ ఫుడ్ ఫెస్టివల్‌ను మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్స్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఫుడ్ ఫెస్టివల్ విజయవాడలో 'ఎ ' కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుందన్నారు. ఫిష్ ఆంధ్రా మినీ షాపులను, ఫిష్ ఆంధ్రా స్పోక్స్ రూ.10 లక్షల యూనిట్లు, రూ. 20 లక్షల యూనిట్లు, రూ. 50 లక్షల యూనిట్లు, కోటి రూపాయలు విలువ గల ఆక్వాహబ్ యూనిట్లు ప్రమోట్ చేయడానికి, ప్రోత్సహించేందుకు, ప్రజల్లో చేపలు, వాటి ఉత్పత్తులను, వాటి వల్ల ప్రయోజనాలను తెలియజేసేందుకు సీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. వీటిలో కేవలం రూ.699కే అన్ లిమిటెడ్ ఫుడ్ అందజేస్తున్నారని చెప్పారు. పిల్లలకు అలవాటు చేయుటకు ఉచితంగా సీ ఫుడ్డు అందజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇందులో మంచినీటి ఫిష్, సీఫుడ్ అన్ని రకాల స్టాల్స్‌ను నిర్వహిస్తారని అన్నారు. వివరాలకు మొబైల్ నెంబర్లు 89469655, 931870494 సంప్రదించ వచ్చని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సాలూరు ఎంపిడిఒ శ్రీదేవి, పాలకొండ ఎఫ్‌డిఒ డి.గోపీకృష్ణ, ఐఎఫ్‌సిఎస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో అరాచకాలు ఆపాలి

ప్రజాశక్తి - సాలూరు

మణిపూర్ జరుగుతున్న హింసా కాండను, అక్కడ మహిళలపై జరిగే దాడులను వెంటనే ఆపాలని సాలూరు రూరల్ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఐసిడిఎస్ రూరల్ కార్యక్రమంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం గల ఈశాన్య భారతదేశంలో ఎప్పుడూ చూడని విధంగా నేడు మత పరమైన విద్వేషాలను రెచ్చగొట్టి అక్కడి ప్రజలు మధ్య కులాలు, మతాలు, తెగలుగా విడదీసి అమాయకులైన ప్రజల మాన, ప్రాణ భయంతో బ్రతుకుతున్నారని అన్నారు. ఇటువంటి నీచమైన పనులను చేస్తున్న వారిని కాపాడుతున్న ముఖ్యమంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలని, అక్కడ మహిళలపై దాడులను ఆపి, మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆరిక నారాయణమ్మ, పార్వతి, ఉత్తరమ్మ, జానకి, సుభద్ర, ఇందిరా,రాజమ్మ, శాంతి పాల్గొన్నారు.

సీతానగరం :మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాద శక్తులు గిరిజనులు, గిరిజనేతరుల మధ్య చిచ్చుపెట్టి మత ఘర్షణలు రేపుతున్నాయని విమర్శించారు. మహిళలపై అత్యాచారం, హత్య చేసిన దోషులను శిక్షించాలని, ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి వెంకటరమణ, వి.ఈశ్వరరావు, గౌరి తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆయకట్టు రైతులకు సాగునీరివ్వాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పెద్దంకలాం ఆనకట్ట కాలువ పనులు పూర్తి చేసి, కాలువలో పేరుకుపోయిన సిల్టు తొలగించి చివరి భూములకు సాగునీరివ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా రైతు సంఘం కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డిఆర్ఒ జె.వెంకట్రావుకు వినతిని అందజేశారు. అనంతరం లక్ష్మునాయుడు, మండల కార్యదర్శి బలగ సత్యనారాయణ మాట్లాడుతూ పెదఅంకలాం కాలువ ద్వారా సాగునీరు రావడం లేదని, గండ్లు పూడ్చలేదని తెలిపారు. కాలువలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించలేదని, కాలువ మరమ్మతుల పేరిట నాలుగేళ్ల నుంచి చుక నీరు ఇవ్వలేదని తెలిపారు. పనులు కూడా సక్రమంగా జరగడం లేదన్నారు. లైనింగ్ పనులు ప్రారంభించినా ఎక్కడా జరగలేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన కాలువలో నీరు రాకపోవడం వల్ల రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. జైకా నిధులు రూ.18 కోట్లు ఎక్కడ ఖర్చు పెట్టారు, ఎంత ఖర్చు పెట్టారో తెలియడం లేదని అన్నారు. ఇలా పనులు చేస్తే మరో ఐదు, ఆరేళ్లయినా సాగునీరందని పరిస్థితి నెలకొందన్నారు. కావున తక్షణమే కాలువలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించి గండ్లు పూడ్చి చివరి భూముల వరకు నీరు ఇవ్వాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో రైతు కూలీ సంఘం నాయకులు మామిడి సింహాద్రి నాయుడు, శంకర్రావు, లక్షణ, సిపిఎం నాయకులు వై.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఒకు వినతిని అందజేస్తున్న రైతులు

సీతానగరం ఆయకట్టు నీరు విడుదల

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సువర్ణముఖి నది కొత్తవలస వద్ద ఉన్న సీతానగరం ఆయకట్టు ప్రాజెక్టు నీటిని బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆయకట్టు పరిధిలో 3850 ఎకరాలు 10 గ్రామాల రైతులకు సాగునీరందిస్తుందన్నారు. ఇబ్బందుల్లేకుండా పూర్తిస్థాయిలో సాగు నీరు అందిస్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైతు పండించే పంటను పూర్తిగా మద్దతు ధర ఇచ్చి ఆదుకుంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఆయకట్టు ప్రాజెక్టు చైర్మన్ తెంటు వెంకట అప్పలనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిటిసి సత్యనారాయణ, వైసిపి నాయకులు బొంగు చిట్టిరాజు, ఆయా గ్రామ సర్పంచులు ఎ.తిరుపతిరావు, సత్యనారాయణ, రామకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

టిడ్కో ఇళ్ల సముదాయాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఆగస్టులో అందజేసేందుకు అధికారులు పనులు పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర, ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు నాటికి లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని, ఆ దిశగా సాలూరులో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాల నిర్మాణ ప్రగతిపై బుధవారం వారు తనిఖీ చేశారు. సాలూరు మున్సిపాల్టీలో పరిధిలో గల 1048 గృహాలు ప్రారంభోత్సవాలకు అందించే దిశగా నిర్మాణం జరుగుతున్నట్లు, వంటి పనులను ఇంజనీరింగ్, మునిసిపల్ అధికారులతో కలిసి పరిశీలించాలన్నారు. అలాగే గుమడాం వద్ద నిర్మిస్తున్న 1280 టిడ్కో ఇళ్లకు సంబంధించి (హౌసింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్) పనుల పురోగతిని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ (వి.ఎన్.సి అండ్ శింఘన్) సిబ్బందితో కలిసి పర్యటించి తదుపరి వారితో సంయుక్తంగా చర్చించడంతో పాటుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగష్టులో ఇళ్ల నిర్మాణాలను పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందజేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులను, ఏజెన్సీని ఆదేశించారు. కార్యక్రమంలో టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ నరసింహమూర్తి, మున్సిపల్ కమిషనర్ హనుమంతు శంకరరావు, ఇఇ జ్యోతి, డిఇ బాలకృష్ణ రెడ్డి, శశిధర్, సిఎల్‌టిసి కాంట్రాక్టింగ్ ఏజెన్సీ పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల సముదాయాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం, డిడ్కో చైర్మన్

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

గ్రీన్ అంబాసిడర్లకు తక్షణమే జీతాలు చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీలకు విడుదల కావడంతో తక్షణమే స్పందించి కార్యదర్శుల ద్వారా జీతాలు చెల్లించాలని వారు కోరారు. అనంతరం ఎంపిడిఒ ఎ.ఎస్.ఎల్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌరీశంకర్‌నాయుడు, జి.ఆనంద్, పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పెదఅంకలాం పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదఅంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య అధికారి బి.జగన్నాథరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది రికార్డులను పరిశీలించారు. అలాగే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు గ్రామాల్లో పారిశుధ్యం లేకుండా చూడాలన్నారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.రాధాకాంత్, ఇఒ జి.సూర్యనారాయణ, హెచ్‌వి వరలక్ష్మి,

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరకండి నుంచి బక్కుపేట వరకు బిటి రోడ్డు నిర్మాణ పనుల కోసం పూజా కార్యక్రమాలను ఎమ్మెల్యే ఎ.జోగారావు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో గ్రామాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.లలిత, ఎంపిటిసి సభ్యులు ఎం.శ్రీను, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి నాయకులు బి.చిట్టిరాజుతో పాటు పలు గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేదాంత కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న జెసి గోవిందరావు

ఉన్నత స్థానాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలు సాధన దిశగా పయనించి ఉన్నత స్థానం అధిరోహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అర్.గోవిందరావు ఆకాంక్షించారు. స్థానిక వేదాంత కళాశాల నుండి ప్రతిభ కనబర్చిన విద్యార్థులనుబుధవారం తన ఛాంబర్‌లో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం ఎంతో విలువైనదని, కఠోర దీక్షతో అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఐఐటిలో సీట్లు సాధించిన పి.హరిప్రియదర్శిని, తుంబలి సందీప్, కడియాల గౌతమ్ కుమార్, తుడుము సుజిత్‌కుమార్‌ను అభినందించారు. అలాగే ఇంటర్‌లో 985 మార్కులుసాధించి జిల్లాలో మొదటి స్థానం సాధించిన గెంబలి విజయ గౌరి, ఫస్ట్ ఇయర్‌లో రాష్ట్రస్థాయి నాలుగోస్థానం సాధించిన కె.సుహర్షినిని జెసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్‌మెంటర్ పి.అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ఎల్ నాయుడ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వాసవీ క్లబ్ సరస్వతి పథకం కింద స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ రీజనల్ చైర్పర్సన్ ఎం.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ క్లబ్ ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పేద విద్యార్థులను ఆదుకోవడం అనేక మంచి కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జోనల్ చైర్పర్సన్ ఎ.సత్యనారాయణ, వాసవీ క్లబ్ మండల ప్రెసిడెంట్ ఎ.గోవిందు, సెక్రటరీ కె.లక్ష్మణరావు, డైరెక్టర్ కె,శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంటువానివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బంటువానివలస నిర్వాసిత కాలనీలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం ద్వారా బుధవారం బందలుప్పి వైద్యాధికారి తిరుమల ప్రసాద్ సేవలందించారు. గ్రామంలో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారని, వీరందరికీ ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశిమని అన్నారు. సీజనల్ వ్యాధులు బారినపడిన వారందరికీ 11 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి అనంతరం మందులు అందించినట్లు తెలిపారు. రక్త పరీక్షలు నిర్వహించి మలేరియా ఉన్నవారికి సంబంధించిన మందులను అందజేశామన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి

ప్రజాశక్తి - భామిని

విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎంపిడిఒ రామచంద్రరావు, ఇఒపిఆర్‌డి కె.కృష్ణారావు సూచించారు. మండలంలోని బాలయోగి గురుకుల పాఠశాలను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆహారం తయారీకి వినియోగించే నూనె, వంట సామాగ్రి, స్టోర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని, వసతి గహాల్లో శానిటేషన్ బాగుండాలి, మరుగుదొడ్లు నిరంతరం పరిశుభ్రత చేయాలనీ సూచించారు. కార్యక్రమం ప్రిన్సిపాల్ విజయనిర్మల, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది వున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి అన్నారు. మండలంలోని పులిపుట్టి జిపిఎస్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి ముందుకు తీసుకురావాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు అందరికీ అందాలన్నారు. మధ్యాహ్నం భోజనం పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ఆటల పాటలతో విద్యను బోధించాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థు లు డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - సాలూరు

ఆస్పత్రి పనులను పరిశీలించిన డిప్యూటీ సిఎం

ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చెప్పారు. బుధవారం ఆయన నిర్మాణంలో వందపడకల ఆసుపత్రి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో వసతి సమస్య ఉందని, దీనివల్ల ఒక బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులను ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. డిసెంబర్ నాటికి ఆసుపత్రి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టరును కోరామని, దీనికి సంసిద్ధత వ్యక్తం చేశారని చెప్పారు. రోజువారీ అవుట్ పేషెంట్ల సంఖ్య గతం కంటే బాగా పెరిగిందని చెప్పారు. ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ సమీక్షలో పాచిపెంట పిహెచ్‌సిని సిహెచ్‌సిగా అప్ గ్రేడ్ చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. సాలూరు మండలం మామిడిపల్లి లేదా తోణాం పిహెచ్‌సిని సిహెచ్‌సిగా అప్ గ్రేడ్ చేయాలని కోరామని, ఈ ప్రతిపాదనలు అమలైతే గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లోనూ వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు.

అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు

స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, వస్తువుల కొనుగోలుకు ఆమోదించారు. ఆరోగ్య శ్రీ విభాగానికి ఒక కంప్యూటర్, ఆరోగ్య మిత్రులకు రోగుల సమాచారం భద్రపరచడానికి మరో కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాలని ప్రతిపాదించారు. చెవి, ముక్కు, గొంతు వైద్యానికి సంబంధించిన పరికరాలను కొనుగోలు నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన అత్యవసర రోగులను స్టెబిలైజ్ చేయడానికి అవసరమైన పరికరాలు కూడా కొనుగోలు చేయాలని ప్రతిపాదించారు. ఆపరేషన్ థియేటర్‌లో అవసరమైన బెడ్‌షీట్ కొనుగోలు, లేబొరేటరీలో విద్యుత్ అంతరాయం వల్ల ఇబ్బంది లేకుండా ఇన్వర్టర్, ఆపరేషన్ థియేటర్‌లో డాక్టర్లకు అవసరమైన డ్రెస్సులు, సిబ్బందికి అవసరమైన గౌనులు, రోగులకు డ్రెస్సులు కొనుగోలుకు ప్రతిపాదన చేశారు. ఇతర విభాగాల్లో అవసరమైన పరికరాలు, వస్తువుల కొనుగోలు కోసం ప్రతిపాదనలను కమిటీ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ బి.అప్పలనాయుడు, సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్, ఆర్ఎంఒ రత్నకుమారి, కమిషనర్ శంకరరావు, కౌన్సిలర్లు మాధవరావు, ఎస్.ఈశ్వరరావు, వైసిపి నాయకులు హరిబాలాజీ, చొక్కాపు గోపి పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపుపై బిఎల్ఒలు అప్రమత్తం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను ఆర్‌డిఒ కె.హేమలత బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని పెదబొండపల్లి, కవిటిభద్ర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు 74, 92 పరిధిలో తనిఖీ చేశారు. గ్రామస్తుల సమక్షంలో తొలగించిన ఓటర్ల జాబితా చదివి వినిపించారు. వారి వివరాలు ఆరా తీశారు. దీర్ఘకాలికంగా గ్రామంలో లేకపోవడం లేదా మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు శాతం కంటే ఎక్కువ తొలగింపులుంటే నిశితంగా పరిశీలించాలని సహాయ ఓటరు నమోదు అధికారి, ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. ఇంటింటి సర్వే పక్కాగా ఉండాలని, బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వేలో భాగంగా సంబంధిత ఓటరు దరఖాస్తులు తీసుకువెళ్లాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను పరిశీలించాలి, ఓటర్ల జాబితాలో సవరణలుంటే వాటిని గుర్తించాలని ఆమె పేర్కొన్నారు. చిరునామాను మార్చుకున్న ఓటర్ల వివరాలు, 10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్ల డోర్ నంబర్ల చిరునామా తనిఖీ చేయాలని చెప్పారు. ఇంటి నెంబర్లకు సంబంధించిన ఎంట్రీల సవరణ కోసం ఫారం-8 సేకరించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బిఎల్ఒలు పాల్గొన్నారు.

వీరఘట్టంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని మూడో సచివాలయం పరిధిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంత కుమారి, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పథకాలు సత్వర పంపిణీకే సచివాలయ వ్యవస్థ

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజలకు సంక్షేమ పథకాలు సత్వరం అందించేందుకే సచివాయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండల కేంద్రంలోని రూ.40లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీతంపేట -2 సచివాలయ భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యామే ఈ సచివాలయ వ్యవస్థ అన్నారు. గతంలో మాదిరి ప్రజలు అధికారులు, నాయకుల చుట్టూ తిరగకుండా ఈ వ్యవస్థల వల్లే నేడు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటికి చేరుతున్నాయని తెలిపారు. ప్రజా పరిపాలనలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యం దిశగా పయనిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, పాలకొండ ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్‌రావు, జెడ్‌పిటిసి ప్రతినిధి సవర రాము, వైస్ ఎంపిపి కుండంగి సరస్వతి, వైస్ ఎంపిపి ప్రతినిధి మూటక రామారావు, స్థానిక సర్పంచ్ బ. కళావతి, వైస్ సర్పంచ్ పాలవలస బృందావతి, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, పాల్గొన్నారు.

టీకా నిర్వహణకు ముందస్తు ప్రణాళిక

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

టీకా నిర్వహణకు ముందస్తు కార్యచరణ ప్రణాళిక తప్పనిసరి అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన పట్టణంలోని 15,16 వార్డులకు చెందిన టీకా నిర్వహణ కేంద్రాన్ని బుధవారం సందర్శించి, టీకా వేయాల్సిన పిల్లలు, గర్భిణీల అర్హుల జాబితా పరిశీలించారు. టీకా గడువు తేదీలను నమోదు చేయడం, ముందస్తు సమాచారం ఇవ్వడం, వేస్తున్న టీకా ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించడం తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది పరిధిలో ఉండే గర్భిణీలందరికీ టిడి వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం వేయడం పూర్తి చేయాలని, అలాగే పిల్లలకు వేసిన ప్రతి టీకా వివరాలు ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో అదే రోజు నమోదు చేయాలని అన్నారు. అనంతరం సీజనల్ వ్యాధుల దృష్ట్యా పిల్లలు, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెఒంట

మండలంలోని పి.కోనవలస గురుకుల ఆశ్రమ పాఠశాలను ఎంపిపి బి.ప్రమీల బుధవారం పరిశీలించారు. ముందుగా రికార్డులు పరిశీలించి తదుపరి క్లాస్ రూమ్‌లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు గురించి నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. జగనన్న విద్యా కానుక కిట్లులో చాలామందికి షూలు అందలేదని తెలిపారు. అలాగే జ్వరాలతో బాధపడుతున్న పలువురు విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్‌ను, ఎఎన్ఎంను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని వండి పెట్టాలని సిబ్బందికి సూచించారు. డైనింగ్ హాల్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ భోజనం చేసే పరిస్థితి ఏర్పడిందని ప్రిన్సిపల్ ఎంపిపి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లగా, కొత్త డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టేలా చర్యలు చేపడతానని ప్రిన్సిపల్‌కు తెలిపారు. పరిశీలనలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన చిరంజీవులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

స్థానిక మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు టిడిపి అధినేత చంద్రబాబు పిలుపు మేరకు బుధవారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితి, నాయకుల తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రకటించిన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తూ స్థానిక నాయకులు మండల పార్టీ అధ్యక్షులు మహిళా నాయకులతో సమన్వయం చేసుకొని పార్టీ ప్రకటించిన మహాశక్తి పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, అలాగే అధికారపక్షంలో ఉన్న వైసీపీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు.

చంద్రబాబుకు బొకేను అందజేస్తున్న చిరంజీవులు

వంతెన ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం :

వంతెనను ఏర్పాటు చేసి గిరిజన ప్రజలను ఆదుకోవాలని టిడిపి యువనేత వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్ అన్నారు. బుధవారం మండలంలో గల గొటివాడలో పర్యటించి గిరిజన గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొటివాడ పంచాయతీ నుంచి బోరి,బండిగూడ, బల్లేరు, బోరుగూడ, కిడికేసు, బల్లేరుగూడ, నిడగల్లుగూడ గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే మధ్యలో గెడ్డ దాటాల్సిన ప్రమాదకర పరిస్థితుల్లో గిరిజన గ్రామస్తులు ఉన్నారని అన్నారు. గెడ్డపై తాత్కలికంగా కర్రలతో వంతెన ప్రతి ఏటా ఏర్పాటు చేసుకుంటున్నారని కావునా ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శాశ్వతంగా వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోటివాడ మాజీ సర్పంచ్ సుందరరావు, టిడిపి నాయకులు బోటు గౌరిశంకరావు, శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

సబ్సిడీపై వలలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

పెద్దగెడ్డ జలాశయంలో చేపలు పట్టే గిరిజనమత్స్య కార్మికులకు సబ్సిడీ ద్వారా వలలను పంపిణీ చేయాలని నాణ్యమైన వలలు పంపిణీ చేసి ఆదుకోవాలని నిర్వాసిత మత్స్యకార సంఘం నాయకులు, గిరిజన సంఘం మండల కార్యదర్శి జన్ని రామయ్య, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పెద్దగెడ్డ జలాశయం వద్ద మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వలలను పంపిణీ చేసి ఆదుకోవాలన్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద 800 వరకు సిఎం చెల్లించి వలలను కొనుగోలు చేసిన 15, 20 రోజుల వరకు వలలు పనిచేస్తున్నాయని వెంటనే పాడైపోతున్నాయని అన్నారు. అందుకే ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వలలను పంపిణీ చేసి ఆదుకోవాలన్నారు. చేపల పట్టడం సంబంధించి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పెద్దగెడ్డ జలాశయంలో ఈదురు గాలుల వల్ల తెగి పాడైపోతున్నాయని నీటిలో మునిగిపోతున్నాయని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లోనే వలలు కొనుక్కోలేక ఇతర ఏ పనులు చేయలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ, ఉన్నతాధికారులు స్పందించి గిరిజన మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పుంగారి సీతారాం తదితరులు పాల్గొన్నారు

సొంత డబ్బుతో రచ్చ బండ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో తమ సొంత డబ్బులతో నిర్మించిన రచ్చబండను బుధవారం ఆ గ్రామ పెద్దల సమక్షంలో ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన రౌతు. మురళి, బాపూజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు కలిసి సుమారు రూ.60వేలతో ఊరికి దగ్గరలో ఉన్న స్మశానం దగ్గర సంజీవనాయుడు పెంచిన చెట్టు కింద ఈ రచ్చబండ నిర్మించారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు నేడు ప్రజలే చేసుకుంటున్నారు. కార్యక్రమంలో రాము సతీష్. భాస్కర్ గౌరినాథ్ తదితరలు పాల్గొన్నారు

కంబర్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కష్ణమూర్తి నాయుడు భవిష్యత్తు గ్యారెంటీ మహాశక్తి యాత్రను బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా సంఘాల కార్యదర్శి కనుగల లలిత కుమారి మాట్లాడుతూ టిడిపి మేనిఫోస్టోను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి లూర్తు కుమారి నంబర్లు తదితరులు పాల్గొన్నారు.

పెదఅంకలాంలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెద్దఅంకలాం గ్రామ సచివాలయంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వంఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసు కుని పరిష్కరించే దిశగా కృషి జరుగుతుం దన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించే చేయడం జరుగుతుందన్నారు. ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, వైసిపి నాయకుల బి.చిట్టిరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని హడ్డుబంగి సచివాలయం చింతాడ పంచాయతీ చింతలుగూడ,సున్నంగూడ, కింద్రవాడ,పెద్ద కింద్రవాడ,(పెద్దగూడ),చింతాడ, గెడ్డ గూడ, మెట్టుగూడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వి.కళావతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరువేరుస్తున్నామని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, ఎపిఒ రేగిడి బాబురావు, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ గుడివాడ శంకరరావు, స్థానిక సర్పంచ్ సవర దేవమ్మ, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ అకాడమీకి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-పాలకొండ

విశాఖపట్టణం అక్కయ్యపాలెం వాలీబాల్ సాయి స్పోర్ప్ అకాడమికి పాలకొండ పట్టణం పెదకాపువీధి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి యామల అభిషేక్ కుమార్ ఎంపికయ్యాడు. తన కుమారుడు ఎంపిక కావడంతో ఈశ్వరరావు ఆనందం చెందాడు. పాఠశాల హెచ్ఎం సోమేశ్వరరావు, పిడి పుష్పనాథం విద్యార్థికి అభినందనలు తెలిపారు.

లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపిపి పద్మావతి

సంక్షేమ పథకాలతో ప్రజలకు సంతృప్తి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. బుధవారం బియ్యాలవలస సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ , జడ్పిటిసి జి.సుజాత ,జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ చంద్రశేఖర్, సర్పంచులు శెట్టి సురేష్, సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు బడిలోకి రావాలి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్చాలని డిఇఒ కార్యాలయ అసిస్టెంట్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి రోజా రమణి తెలిపారు. మండలంలో డ్రాపౌట్ విద్యార్థులు వివరాలు, దానికి కారణాలను సిబ్బందిని అడిగి తెలిపారు. ఇందులో భాగంగా డ్రాపౌట్ విద్యార్థి కోలక బావిచరణ్‌కు స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రవేశం కల్పించారు. అనంతరం కోసలి గ్రామం వెళ్లి ఆ గ్రామంలో డ్రాపౌట్ అయిన ఇద్దరు బాలికలు, ఒక బాలుడ్ని గుర్తించి, బాలికలను భామిని కెజిబివిలో చేర్పించారు. బాలుడ్ని అతనికి నచ్చిన పాఠశాలలో చేర్పించాలని ఎంఇఒలకు సూచించారు. అనంతరం మండలంలో డ్రాపౌట్ వివరాలను ఎంఆర్‌సి సిబ్బందికి తెలియజేసి, వివరాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కరరావు, సిఆర్‌పిలు ఉన్నారు.

వయ్యారిభామలతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - పాచిపెంట

వయ్యారిభామ కలుపు వల్ల పశువులు, మనుషులు వ్యాధుల బారిపడతారని, జీవ వైవిధ్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందని పర్యావరణ పరిరక్షణ డాక్టర్ వైయస్సార్ పొలంబడిలో ఒక భాగమని కావున సామూహిక నిర్మూలన పద్ధతుల ద్వారా పూత రాక ముందే వయ్యారి భామలు పూర్తిగా నిర్మూలించాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని అమ్మవలసలో పత్తి పంటపై 14 వారాల పాటు నిర్వహించే డాక్టర్ వైయస్సార్ పొలంబడి ఐదో వారం కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులకు కలుపు మొక్కలతో పాటు కలుపు మందులపై కూడా అవగాహన ఉండాలని, డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో దీనిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. రసాయన ఎరువులు విచక్షణా రహితంగా వాడడం వల్ల భూమిలో జీవవైవిద్యం దెబ్బతిని వానపాములు పూర్తిగా నిర్మూలించబడతాయని, కావున రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. అంతేకాక విచక్షణారహితంగా ఎరువులు వాడడండెంతో ప్రమాదమన్నారు. యూరియా తగిలిన 10 సెకండ్లలోపే వానపాములు చనిపోయే ప్రయోగాన్ని రైతులకు చూపించి విచక్షణ రహితంగా రసాయనాలు వాడటం ఎంత ప్రమాదకరమో తెలిపారు. అలాగే సేంద్రియ ఎరువులతో పొటాష్ తయారీ విధానాన్ని విఎఎ మోహనకృష్ణ ఆధ్వర్యంలో చేసి చూపించారు. అలాగే చేప

భామినిలో వరినాట్లు విధానం తెలుపుతున్న ఎఒ

వ్యర్థాలు పంటలకు ఎంతో బలమని ఎపిసిఎన్ఎఫ్ఆర్‌సి బాలకృష్ణ తెలిపారు. అనంతరం మీనామృతం తయారీ చూపించి గట్లపై ఉన్న వయ్యార భామ కలుపులను నిర్మూలించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద రేయి అప్పారావు, ఐసిఆర్‌పి విజయ్, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : ఎంట్రీ పాయింట్ ఆక్టివిటీ చేయించి నియమిత మోతాదులో పురుగు మందులు వాడాలని మండల వ్యవసాయాధికారి ఎ.అవినాష్ సూచించారు. మండలంలోని కె.వెంకటాపురంలో పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురుగు మందులు స్ప్రే చేసేటప్పుడు జరిగే చర్యలు, స్ప్రే చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరిలో కలుపు వల్ల జరిగే నష్టం, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే బెండ, చిక్కుడు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వరి పొలం గట్లపై వేయడానికి కంది విత్తనాలను పంపిణీ చేసి వారి వల్ల పంట్ల కలిగే ఉపయోగాలపై రైతులకు వివరించారు. అనంతరం రైతులతో బృందవిన్యాసాలు చేయిస్తూ తాడుతో ఆటలు వంటివి ఆడించి, స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శ్రీనివాసరావు, లంక సూర్య సుబ్రహ్మణ్యం, బుడితి గౌరినాయుడు, బుడితి ముకుందరావు, బుడితి గోపాలకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

సాలూరురూరల్: వరిని వరుస క్రమం లో నాటడం వలన రైతులకు పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి వస్తుందని డిఆర్‌సి కో-ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మామిడిపల్లిలో పొలంబడి కార్యక్రమంలో నిర్వహించారు. వరిసాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎడిఎ సుదర్శన రావు, ఎఒ అనురాధ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని పోలవరంలో పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం ఆధ్వార్యాన జరిగింది. వరినాట్లు వేసేటప్పుడు చేయాల్సిన పనులు గురించి వివరించారు. కార్యక్రమం లో వ్యవసాయం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -సాలూరురూరల్

మండలంలోని దండిగాం జంక్షన్ వద్ద స్థానిక పోలీసులు జరిపిన తనిఖీల్లో 35కిలోల గంజాయి పట్టుబడగా, ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను రూరల్ సిఐ ఎస్.ధనంజయరావు విలేకరులకు వెల్లడించారు. ఒడిశా నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు బుధవారం దండిగాం జంక్షన్ వద్ద రూరల్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఒడిశా నుంచి మోటార్ సైకిల్‌పై సుమారు 35 కిలోల గంజాయిని ఒడిశా, బీహార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు తీసుకెళ్తుండగా వారిని నుంచి స్వాధీనం చేసుకున్నారు. వారిని జ్యాడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ ఐ ప్రయోగమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.